క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మాగనూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభాలు రోడ్డు వెంబడి పంట పొలాల్లో ఒరిగిపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని రైతులు, బాటసారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రమాదం సంభవించే అవకాశాలు మెండుగా ఉన్నాయంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి ఏకం కావాలి



మరికల్: మండల కేంద్రంలో పురాతన ఆంజనేయస్వామి ఆలయ పున:నిర్మాణం కోసం గ్రామస్తులు అందరు ఏకం కావాల్సిన సమయం వచ్చిందని ఆలయ కమిటీ సభ్యులు ముకుందారెడ్డి, నిఖిల్, భాస్కర్, లక్ష్మీకాంత్ అన్నారు. ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం గ్రామస్తులు ఈ విషయంపై చర్చించేందుకు సమావేశమయ్యారు. ఇక్కడ ఉన్న స్థలాన్ని విస్తరించి ఆలయం నిర్మాణం చేపట్టే విధానంపై కుల సంఘాలు, యుజన సంఘాలు, రాజకీయ, ప్రజాప్రతినిధులతో అభిప్రాయాలు సేకరించారు. ఇందుకు ప్రతి కులం నుంచి ఐదుమంది సభ్యుల చొప్పున ఆలయ నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయం నిర్మాణం కోసం మరోసారి ఈ కమిటీ హాజరవుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు చిట్టెం నర్సిరెడ్డి విగ్రహ పున: ఆవిష్కరణ

మక్తల్: స్వర్గీయ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని పెద్దచెరువు సమీపంలో ఈ నెల 26న ఆయన విగ్రహ పున: ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొంటారన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహకు సన్మానం

మక్తల్: తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆదివారం హైదరాబాద్‌లో పరిపాలన కార్యాలయంలో ఎమ్మెలే వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. మక్తల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై మంత్రి తో చర్చించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మల్లుగౌడ్ తదితరులు ఉన్నారు.

కాడెద్దులను రక్షించిన యువకులు

ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లి జమ్మి చెరువులో మునిగిన కాడెద్దులను ఆదివారం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు రక్షించిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. ధన్వాడ మండలంలోని పాతపల్లికి చెందిన రాజు పొలం పులిమామిడి శివారులో ఉంది. ఉదయం రాజు కుమారుడు అనిల్ కాడెద్దులను తీసుకొని పొలానికి వెళ్తుండగా కొత్తపల్లి శివారులోని జయమ్మ చెరువుపై అవి నీళ్ల తాగేందుకు చెరువులోకి దిగాయి. చెరువు లోతు ఉండడంతో కళ్ల ఎదుటనే నీటిలో మునిగాయి. దీంతో బాబు అనిల్ కేకలు వేయడంతో గ్రామంలోని యువకులు పరుగెత్తుకొని వెళ్లి చెరువులో దిగి కాడెద్దులను రక్షించారు. యువకులు బాలరాజు, కొండయ్య, ఆంజనేయులు, ఆనంద్, మోహన్ తదితరులు ఎంతోసాహసం చేసి ఎద్దులను రక్షించడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా యుగంధర్‌రెడ్డి

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల పాండురంగస్వామి ఆలయ కమిటీ చైర్మన్ యుగంధర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం దేవాలయంలో వేదపండితుడు శ్రీధర్‌జ్యోషి ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమయ్యారు. ఉపాధ్యక్షులుగా వినయ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, కోశాధికారిగా వేణుగోపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డిను నియమించారు.



అధ్వాన రోడ్లతో అవస్థలు



ఉజ్జెల్లి-నేరడగం వెళ్లే రోడ్డు ఇలా..

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారాయి. మట్టిరోడ్లు ఉండడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. మండలంలో 9 గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు. వీటితో పాటు వర్కూర్, ఉజ్జెల్లి, నేరడగం, కోల్పూర్, వడ్వాట్, అడవి సత్యారం, మందిపల్లి గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్న పూర్తిగా ధ్వంసం కావడంతో మట్టిరోడ్ల కన్న అధ్వానంగా మారాయి. అమ్మపల్లి, పర్మన్‌దొడ్డి, గజ్జరందొడ్డి, పుంజనూర్, ఓబ్లాపూర్, పెగడబండ, అచ్చంపేట, బైరంపల్లి, నేరడగందొడ్డి గ్రామాలకు మట్టి రోడ్లు ఉడటంతో వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తమ గ్రామాలకు రోడ్డు నిర్మించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాలినడకే దిక్కు..

గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో మట్టిరోడ్లు ఉన్న గ్రామస్తులకు కాలినడకే దిక్కుగా మారుతున్నాయి. సరైనా రహదారి కూడా లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోతుంది. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వద్వాట్- మాగనూర్ వెళ్లే రోడ్డు ఇలా..

గాల్లో కలుస్తున్న ప్రాణాలు..

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలకు వెళ్లేరోడ్లు అధ్వానంగా మారాయి. గ్రామాల నుంచి బయటకు రావాలంటే ఎడ్లబండ్లే దిక్కవుతున్నాయి. కనీసం అంబులెన్స్‌లు కూడా గ్రామాలకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో అత్యవసర సమయంలోనూ గర్భిణులు, రోగులను ఎడ్లబండ్లలోనే తరలించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో సమయానికి వైద్యం అందక ప్రాణాలు గాల్లోనే కలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఉజ్జెల్లి గ్రామం అటు మాగనూర్, మక్తల్ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు మొత్తం పూర్తిగా అధ్వానంగా తయారైంది. దీంతో కనీసం ద్విచక్రవాహనాలు కూడా తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలి.

– కనకరాజ్ ఉజ్జెల్లి, గ్రామస్తుడు

వాహనాలు పాడవుతున్నాయి..



మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే గుంతల రహదారులపై ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో వాహనాలు త్వరగా పాడవుతున్నాయి. ఎమ్మెల్యే స్పందించి మండలంలోని రోడ్డు లేని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయించాలి.

– ఈశ్వర్‌యాదవ్, నేరడగం గ్రామస్తుడు

ప్రతిపాదనలు పంపించాం..



మండలంలోని పలు గ్రామాలకు బీటీరోడ్డు లేని మాట వాస్తవమే. అయితే ప్రధాన మంత్రి సడక్ యోజన్ కింద మండలంలో అవసరమైన చోట బీటీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతాం.

– మారుతి, పంచాయతీ రాజ్ ఏఈ

మహిళలపై దాడులను అరికట్టాలి

నారాయణపేట రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్‌లో ఆదివారం పీఓడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. దీనిపై యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఈ సంఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్న కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సకాలంలో స్పందించక పోవడం సరికాదన్నారు. దేశంలో ఆడపిల్లలకు భద్రత కరువైందని, బీజేపీ ప్రభుత్వానికి మహిళలపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రోజుకు ఒకపక్క దేశంలో ఆడపిల్లలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని సంబంధిత ప్రభుత్వాలు, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, రూ.10 కోట్ల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సౌజన్య, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా నాయకులు, సునీత, చంద్రకళ మంజుల, అనిత, లక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

బీపీ మండల్‌కు ఘన నివాళి

కోస్గి: బీహార్ మాజీ ముఖ్యమంత్రి జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ బిందేష్ ప్రసాద్ మండల్ జయంతిని ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. మండల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భారత రాష్ట్రపతి బిందేష్ ప్రసాద్‌ను జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించగా ఆయన బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక ఇచ్చినా నేటికీ ఏ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. బీసీల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు నర్సింహులు, రఘు, రాములు, ఫణీంద్ర యాదవ్, వేణుగోపాల్, బీజేపీ నాయకులు శ్రీకాంత్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దూరు: బలహీన వర్గాల స్ఫూర్తి ప్రధాత బీపీ మండల్ జయంతిని మండలంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ఆయన దేశ వ్యాప్తంగా వెనుకబడిన, బలహీన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించడానికి కృషిచేశారని గుర్తుచేశారు. దాస్, కృష్ణ, వెంకట్, పోన్నయ్య, హన్మంతు, ఇలియాజ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నారాయణపేట రూరల్: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ అన్నారు. పట్టణంలోని సత్యనారాయణ స్వామి చౌరస్తాలో ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపించడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దని, వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అదేవిధంగా ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికావొద్దని, సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు గోవింద్రెడ్డి, వాహనదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో చౌక్ బజార్ మిత్రమండలి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మిత్రమండలి అధ్యక్షుడు హరినారాయణ బట్టడ్ తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులు సమావేశమై కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం 9:గంటలకు మెయిన్ చౌక్ లో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 5గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ వేడుకలకు హిందూ బంధువులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలి సభ్యులు టౌన్ బిల్డర్ వెంకట్ రాములు, ప్రకాష్ బట్టడ్, వద్దినారాయణ, శివకుమార్, మురళి, రాజ్ ఘట్, ఆనంద్ పసారి, లక్ష్మణ్‌చారి పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి స్వామివారి డోలరోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పాల ఉట్టి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ వేడుకలకు హిందూ బంధువులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటినుంచి వేణుగోపాలస్వామి ఉత్సవాలు

నర్వ: శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగురోజుల పాటు కొనసాగే ఈ ప్రత్యేక ఉత్సవాలు నేటినుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. సోమవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సాయంత్రం ప్రత్యేక పూజలు, రాత్రికి అఖండ భజనా కార్యక్రమాలుంటాయన్నారు. మంగళవారం స్వామివారికి విశేషపూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఉట్ల కార్యక్రమం తోపాటు సేవ రథోత్సవం ఉంటాయన్నారు. బుధవారం సాయంత్రం బోనం కుండతో బోనం సమర్పణ, పల్లకి సేవ, రథోత్సవ కార్యక్రమాలుంటాయన్నారు. గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు రాత్రి 12:గంటలకు స్వామివారి ఊయల సేవ ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారి కృపాకు పాత్రులు కావాలని వారు కోరారు.



ముస్తాబైన ఆలయం

కాలనీకి బోర్డు ఏర్పాటు

కోస్గి: పట్టణంలో నూతనంగా ఏర్పడిన ఓ కాలనీకి ఆదివారం నూతనంగా నామకరణం చేశారు. తాండూర్ రోడ్డులో ఉన్న నూతనంగా ఏర్పడిన కాలనీకి శ్రీ లక్ష్మీనర్సింహ కాలనీగా నామకరణం చేసి బోర్డు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు సమిష్టిగా నిర్ణయం తీసుకొని వార్డు కౌన్సిలర్ భాను నాయక్‌తో కలిసి నామకరణం బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు బెజ్జు రాంచందర్, యాదయ్య, వార్ల బాల్‌రాజ్, విశ్రాంత ఆర్మీమెన్ వెంకటయ్య, ప్రతాప్, బాల్ నర్సింహులుతోపాటు పలువురు పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే, మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డూ ఇండియా చీఫ్ జి.క్రిష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రం కుర్హినిసెట్టికాలనీలోగల అక్షర స్కూల్‌లో ఆదివారం జీకే షోటోకాన్ పట్టణ అధ్యక్షుడు, మాస్టర్ రాజు ఆధ్వర్యంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణయ్య పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. కరాటే మాస్టర్ రాజు మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో 13 మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ బెల్టులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సాయిబాబ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మద్దూరు: మండలంలోని గీతాంజలీ పాఠశాల సమీపంలోని నిర్మించిన సాయిబాబ ఆలయంలో విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సాయిబాబ సేవా ట్రస్టు సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం గణపతిపూజ, గోపూజ, అంఖడ దీపస్థాపనం తదితర పూజలు, మంగళవారం విగ్రహాల ఊరేగింపు విగ్రహాల ధాన్యదివాసం, రాత్రికి భజన కార్యక్రమం, బుధవారం విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా రథోత్సవం

మద్దూరు: మండలంలోని భూనీడ్‌లో ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం తెల్లవారు జామునా నిర్వహించారు. శ్రావణ మాసంలోని మూడో శనివారాన్ని పురస్కరించుకొని గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు, జాతర కొనసాగాయి.. ఈ మేరకు.. స్వామివారి ఉత్సవ మూర్తిని రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ రథోత్సవానికి మద్దూరు, కొత్తపల్లి, నిడ్జింత, రెనివట్ల, గోకుల్‌నగర్, దుప్పట్‌గట్, తదితర గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

హోరా హోరీగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలలో టాస్ ఎగరవేస్తున్న రమణ

నారాయణపేట రూరల్: క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి క్రికెట్ పోటీలు రెండోరోజు కొనసాగాయి. ఈ మేరకు.. ఆదివారం పోటీలకు అథ్లెటిక్స్ జిల్లా సెక్రెటరీ రమణ హాజరై టాస్ ఎగరవేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆటలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. లీగ్ పోటీలో జాజాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌పై శ్రీసాయి స్కూల్, ద్వారక స్కూల్‌పై ప్రభుత్వ గ్రౌండ్ పాఠశాల, మార్కెట్ లైన్ స్కూల్‌పై కొల్లంపల్లి జెడ్పీస్కూల్, మాడ్రన్ స్కూల్‌పై పీహెచ్‌ఈఎస్ పాఠశాలలు గెలుపొందాయి. రెండో సెషన్‌లో రవితేజపై ట్రిమ్స్ జట్టు, కాకతీయ స్కూల్‌పై జ్యోతిరావుపూలే, కృష్ణగోకులంపై నారాయణ స్కూల్, శిశుమందిర్‌పై కొల్లంపల్లి జెడ్పీ స్కూల్, లిటిల్‌స్టార్స్‌పై శ్రీసాయి స్కూల్, బ్రిలియంట్‌పై ఏయిడెడ్ వైదిక పాఠశాల, డీవీఎం జట్టుపై పీహెచ్‌ఈఎస్ జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు, పీఈటీలు శ్రీధర్, అక్తర్‌పాషా, పర్విన్‌బేగం, రమణ తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం



నారాయణపేట: మండలంలోని నల్లగుట్టతాండలో ఆదివారం డీటీఎఫ్, స్థానిక ఎక్సైజ్‌శాఖ బృందం ఆధ్వర్యంలో దాడులు చేపట్టి ఆరు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని 50లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దేవమ్మ, జములమ్మపై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ కవిత, పేట ఎక్సైజ్ ఎస్ఐ గురువయ్య, సిబ్బంది రాంరెడ్డి, మౌనిక, సంతోష్, కృష్ణవేణి, రియాజ్ ఉన్నారు

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ

నారాయణపేట రూరల్: డ్రాగన్ షోటోకన్ కరాటే స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేటింగ్ టెస్ట్లో నారాయణపేట విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రానికి చెందిన 8మంది విద్యార్థులు పాల్గొని కరాటే విన్యాసాలు ప్రదర్శించి కరాటే బెల్టులు సొంతం చేసుకున్నారు. సుశాంత్, రియజ్ అభిరాం, సాయి చరణ్, సోమిల్ యల్లో బెల్ట్స్, చరణ్ కుమార్, అభిలాష్ బ్లూ బెల్ట్స్ ను సాధించారు. ఆయా విద్యార్థులు డ్రాగన్ షోటోకాన్ స్పోర్ట్స్ ఇండియా చీఫ్ సలాం బిన్ ఉమర్ చేతుల మీదుగా బెల్ట్ లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం వైస్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్, చీఫ్ ఎగ్జామ్ విన్నర్ అంబ్రేష్, టోర్నమెంట్ రీఫార్జ్ మొహమ్మద్ సలీం, ప్రెసిడెంట్ అశోక్, కరాటే మాస్టర్స్ అనిల్, ధర్మేంద్ర, అక్షర, శీను పాల్గొన్నారు.



బెల్టులు అందుకుంటున్న విద్యార్థులు